# ముప్పుటి

## పి. వి. బి. శ్రీరామమూర్తి

ఎందుకోకానీ ప్రకాశరావుకీ రోజు పదకొండుదాటిపోతున్నా నిద్ర రావటం లేదు. శీతాకాలానికి వీడ్కోలు చెపుతూ వేసవికి స్వాగతం పలుకుతున్న రోజులు. చలి టైఫాయిడ్ జ్వరంలా వస్తూ ఒక్కసారి ఎక్కువగానూ, మరోసారి చాలా తక్కువగానూ అనిపిస్తోంది. కిటికీ తలుపులు తీసాడు. దోమలు తమకు స్వాగతం పలకటానికే తలుపుతీసినట్లు లోపలికి ఫోర్సుగా వచ్చేసాయి.

ప్రకాశరావు లేచి కూర్చున్నాడు. చుట్టూ చూసాడు. అందరూ నిద్రపోతున్నారు. గాఢ నిద్రలో ఉన్నారు. భార్య టోకుర్లు తీస్తుంది. ఆ గురక లూనా స్పీడుగా పోతున్నట్లుంది. బయట పడుకున్న అత్తగారూ గురక తీస్తోంది. అది మాత్రం పాత మోటరు సైకిలు వెళ్తున్నట్లుంది చిన్నపిల్లలు కుక్కరు విజిల్ వేసినట్లు వాళ్ళ వయసుకు తగ్గ గురక తీస్తున్నారు.

వీళ్ళంతా ఎంత హాయిగా నిద్రపోతున్నారు?

మరి తనకెందుకు నిద్రపట్టదసలు?

తనెప్పుడయినా గురక తీస్తే మాత్రం అబ్బ. అతెసరు కుతకుత లాడినట్లు ఏమిటా గురక? ప్రక్కకి తిరిగి పడుకోండి.' ' అంటుంది భార్య. రేప్పొద్దున్న 'నువ్వెంత గురక తీసావో తెలుసా?' అని అన్నా ఆమె గురక తీసినట్లు ఒప్పుకోదు!


అసలు గురక లెందుకొస్తాయి?

బాగా అలిసినప్పుడు వస్తాయంటారు కొందరు. సరిగా నిద్రలేకపోయినా వస్తాయంటారు. మరికొందరు. 'సిగ్మండ్ ఫ్రాయిడ్' కలల గురించే రాసినట్టు గుర్తు! ఈ 'గురక' గురించి వ్రాసినట్టు లేదు.

మహానుభావుడు!

తాను చెప్పదలచుకున్న విషయాన్ని ముప్పయి అయిదు లక్షల పదాల్లో చెప్పాడట. పేజీకి ఎన్నిలైన్లో, లైనుకెన్ని అక్షరాలో? అలాటి నిబంధనలేవీ





ఆరోజులో ఎవరూ పెట్టలేదు కామోసు!

పోటీ కోసం ఒక్క కథ రాద్దామని కూర్చుంటే సరిగా మూడు కుదిరి చావదు. మూడ్ కుదిరి ఛస్తే గుంట వెధవలు కాగితాలు లాగేయటం, పెన్ను పట్టికెళ్ళిపోవటం. 'అబ్బ. దీని సంగతోసారి చూద్దురూ! ఇది ఏ పనీ చేసుకోనివ్వటం లేదు. బాబునోసారి ఎత్తుకోండి. నా కవతల బోలెడు పనులున్నాయి. భార్యగోల.

పోనీ

వీళ్లందర్నీ ఎలాగోలా తప్పించుకొని రాద్దామని కూర్చుంటే "ఉరే ప్రకాసెం! విశాఖపట్నం సమంధం వాళ్లు వచ్చి వెళ్లారు కానీ మళ్ళీ ఉత్తరం పత్తరం లేనేలేదు. ఓసారి వెళ్తే బాగుణ్ణేమో. దానికవ్వుడే ఇరవయూరు ఏళ్ళు నిండిపోతాయి రేపు చైత్రానికి" తల్లి వేదన సన్నగా చెవిలో జోరీగలా.

మహాపురుషుడు వేమన!

ఎంత చక్కగా చెప్పాడు?

'ఇంటిలోన పోరు యింతంత కాదయా!'

అసలీ భార్యా, పిల్లలూ, తల్లీ బంధాలూ వీటన్నింటికీ అతీతంగా - సుదూరంగా - పక్షుల్లా - జంతువుల్లా మనుషులు కూడా ఉంటే ఎంత బాగుణ్ను?

'జన్మలన్నిటిలో **ఉత్కృష్టమైన** జన్మ మానవ జన్మంటారు' వేదాంతులు. కానీ ఇది ఉత్కృష్టమైన జన్మ ఎలా అవుతుంది? చచ్చిన శవాలని రాబందుల్లు పీక్కుతింటున్నట్లు తల్లిని పిల్లలూ తండ్రిని తల్లీ, భార్యని, భర్తా, భర్తని భార్యా ఒకర్నొకరు ఈ పీక్కుతినడాలేమిటి?

అసలు మనిషికి స్వేచ్ఛ ఎక్కడుందని స్వతంత్రం ఎక్కడుంది? తనకి నచ్చిన విషయం తను ధైర్యంగా చేయగలడా? అసలీ రకమైన కట్టుబాట్లూ అనుబంధాలూ, అనురాగాలూ, మోహాలు, వ్యామోహాలూ వీటిలో నిజాయితీ ఉందా?

అంతా నటన!

భార్య మీద అభిమానం ఒలకపోసే భార్య పెదాలమీద చిరునవ్వులు నటన! 'నువ్వులేకపోతే నేను లేను జీవించలేను. నాకు మనుగడలేదు' అన్న ప్రియురాలి అధరాల కెంపుల్లో నటన ఒకరిమీద ఒకరి అభిమానం. ఆప్యాయత అంతా నటన.

**ఈ జగత్తంతా స్వార్థపూరితం. సంకుచితం. ఇరుకు ఇరుకు ఇరుకు!**

కాపోతే-

**నవమాసాలూమోసి పెంచి ఎంతో అనురాగం, ఆప్యాతల్నీ పొలకపోసే తల్లి** పండక్కి కూతుళ్ళకి బట్టలు తీయకపోతే ముఖం మీదనే అడిగిందేకానీ, 'అవురా, కోడలికేం రా చీరకొనలేదు అని అడిగిందా? ఒకే కడుపున పుట్టిన కొడుకుమీద ఒకరకం ప్రేమయితే కూతురిమీద మరొక రకమైన ప్రేమ.

అసలీ ప్రపంచంలో ఇంతమంది మనుషులెందుకో?

ఇన్ని సమస్యలెందుకో?

తెల్లారి లేచిందగ్గర్నుంచీ పడుకునే దాకా ఎముకల్ని కొరికేస్తోన్న ఇన్ని సమస్యలెందుకొచ్చాయి? ఉన్న కాడికి తినేసి ఏదో పనిచేసుకుంటూ పోతే ఈ అసంతృప్తులూ, ఆవేదనలూ ఉండవేమో!

అవునూ, ఈ 'అసంతృప్తి' అనేది అసలు ఎవ్వట్నించి మొదలయింది? ఆదిమానవుడు 'సిగ్గు ఎగ్గూ' లేక ప్రవర్తించినపుడు ఈ అసంతృప్తి ఉన్నట్టు లేదే? చెకుముకి రాళ్ళతో... రాతికి రాతికి రాపిడి పెట్టి నిప్పుచేసి పచ్చి పదార్థాలు **కాల్చుకు తినే రోజునుండి, మనిషిని మనిషి దోచుకునే అవస్థ ప్రారంభం అయి నప్పట్నించీ ఈ అసంతృప్తి ప్రారంభ మయిందా!**

అసలీ 'అసంతృప్తి'కి ఆర్థిక అసమానత్వమే కారణం!

వర్గ సమాజమే కారణం!

హెచ్చు తగ్గులే కారణం.

ఒకడు అష్టయిశ్వర్యాలతో, విలాస జీవితాలతో గడుపుతోంటే, ఇంకో ప్రక్క ఆకలి చావులు. ఆరని జ్వాలలు, తీరని కోరికలు! అసంతృప్తి! అసంతృప్తి! అసంతృప్తి!

ఈ ప్రభుత్వాలు ఉన్న సంపదల్ని సరిసమానంగా పంచే ప్రయత్నాలు ఎందుకు చెయ్యవసలు. ఈ ప్రపంచం అంతా ఒకకుటుంబం. మనమంతా దేవుని బిడ్డలం. అన్ని మతాలు ఒకటే, అందరం ఒకటే అంటారే? మరి ఈ సంపదలు అందరివీ అనే భావన ఎవరికీ కలగదేం?

ఒక కుటుంబంలో తండ్రిగడించిన ఆస్తి ఆ తండ్రికి పుట్టిన సంతానం అంతా సమానంగా పంచుకోవాలని చట్టం చెపుతోంది. కోర్టులు చెపుతున్నాయి.

మరి మనం అంతా ఒకటే, సర్వమానవ సౌభ్రాతృత్వం కావాలనే ఈ ప్రభుత్వాలు, ఈ నాయకులు ఈ మఠాధిపతులు, మతాధిపతులు ఉన్న ఆస్తిని సమానంగా పంచుకోమని చెప్పరేం? ప్రతి వ్యక్తికి వ్యక్తిగతమైన ఆస్తులసలెందుకు?

మహాపురుషుడు లెనిన్!

ఎంత చక్కని పరిపాలనా విధానం అందించాడో ప్రజలకి?


**తిండి, బట్ట, గూడు, చదువు అన్నీ ప్రభుత్వమే సమకూర్చి పెట్టే పరి పాలనందించాడు. అవునూ, మరి వాళ్ళు మాత్రం ఎందుకలా చితికిపోయారు?**

గర్జించు రష్యా, గాండ్రించు రష్యా!

ఏం గర్జించింది? ఏంగాండ్రించింది? ఇప్పుడు వాళ్లు వాళ్లూ కొట్టుకు ఛస్తున్నారు.

కుటిల, సంకుచిత మనస్తత్వాల మనుషులతో ఎలాటి వరాలిస్తే ఏం ప్రయోజనం?

అసలు కష్టపడినవానికి ఫలితం ఎక్కడయినా అందుతోందా? దేవతలూ,




దానవులూ కష్టపడి సముద్రమథనం చేసారు? అమృతాన్ని ఎవరెత్తుకు పోయారు? దేవతలు, దోపిడీ ఎవరిది? దేవతలది! వీళ్ళు ఆరాధ్యులా!

నిజమే.

దోపిడీ దార్లే ఆరాధ్యులు. దైవాలు.

రైతుని బానిసని చేసే భూకామందు రైతుకు దైవం!

నిరంతరం కష్టించి పనిచేసే కార్మికునికి ఫ్యాక్టరీ యజమాని దైవం. వాళ్ల దయాదాక్షిణ్యాలకోసం చాతకపక్షిలా ఎదురు చూడాల్సిందే!

**కార్మిక వర్గపు కళ్యాణానికి పాటు పడేవారెవరు?**

వాళ్ల ఘర్మ జలానికి, మర్మ జలానికి ఖరీదు కట్టే షరాబులేరి?

'ఎచ్చట రైతునేలను దున్నుతున్నాడో

ఎచ్చట శ్రామికుడు రాళ్ళు పగులగొడుతున్నాడో

అక్కడ పరమాత్ముడున్నాడు'

అవును. ఇది నిజం. కానీ ఈ మహాకవి అమృత వాక్కులకు విలువనిచ్చే మనుషులేరీ? తమాషా ఈ మహాకవి పచ్చితాగుబోతుగా.......

**అవునసలు కార్మికులు కష్టపడుతున్నారా?**

ఎందుకు కష్టపడటం లేదు?

కష్టపడితే ఈ కర్మాగారాలు ఇంత నష్టాల్లో ఎందుకు కూరుకు పోతున్నాయి?

కాదు...కాదు....దీనికి కారణం కార్మికులు ఎంత మాత్రంకాదు.

పభుత్వం లోపం.... యజమాని లోపం.... వ్యవస్థలోపం.

వ్యవస్థ ఏమిటి చేస్తోంది? అయిందానికి ఆకుల్లోనూ, కానిదానికి కంచాల్లోనూ అన్నట్లు చేస్తోంది.

కాకపోతే ఏమిటి?

ఎవ్వడో అయోధ్యలో రాముడుండేవాడట. కొన్ని యుగాలు గడిచిపోయింది కొన్ని వందలసంవత్సరాలు గడిచిపోయింది ఆ ఆలయం భూగర్భంలో కలిసిపోయి.

ఇవాళ దానిగురించి తగువులెందుకు?

కలిసి మెలిసి సర్దుకుపోక ఈ రక్తపాతాలు ఎందుకు?

రక్తం! రక్తం! రక్తం!

ఇంకా రక్తదాహం తీరక ఏమిటీ అల్లర్లు? ఆందోళనలు?

నిజంగా ఈ విషయంలో 'ప్రధాని' మెతక వైఖరి అవలంభించారనటం సమంజసమా? ఎంత మాత్రం కాదు!

కానీ విచిత్రం!

తన భార్య ఈ విషయంలో తనతో ఏకీభవించదు.

"ఏయ్! లల్లీ...లల్లీ... ఒక్కసారిలే"

"అబ్బ. ఇంకాపడుకోలేదా?"

అదికాదోయ్. అసలు అయోధ్యబాబ్రీ మసీదు గొడవలో పీవీ వైఖరి మీద నీ అభిప్రాయం ఏమిటసలు....మొన్నడిగితే సరిగా చెప్పనేలేదు."

"మీకేం మతిపోయిందా? బంగారంలాటి నిద్రపాడు చేసారు? ఇంత అర్ధరాత్రి ఈ అత్యవసర సమావేశం ఎందుకు? రాష్ట్రపతో, ప్రదానమంత్రో మిమ్మల్ని సలహా అడిగినట్లు, పిల్లల భవిష్యత్తు గురించి ఎప్పుడయినా యింతలా ఆలోచించారా? వయసు పెరిగి, కోరికలతో కుళ్ళిపోతున్న మీ చెల్లెలి పెళ్ళి గురించి యింత సీరియస్‌గా ఎప్పుడైనా ఆలోచించారా? పడుకోండి."

పడుకుండిపోయింది భార్య. పిడుగుల వర్షం కురిపించి, ఇంత అర్ధరాత్రి లేపి 'నీకేరంగు చీరకావాలనో, చేతికి బంగారు గాజులు చేయిస్తానో అంటే ఈ రాత్రి స్వర్గం చూపేదేమో?'

అయిన -

ఏదో అభిప్రాయం అడుగుతే చెల్లిపెళ్ళి, అదీ ఇదీ అంటుందేమిటి?

సమయం రెండు గంటలయింది.

చలి విపరీతంగా వేస్తోంది.

కానీ గుండెల్ని పిండేసే భయం.

'పిల్లల భవిష్యత్తు! చెల్లెలి పెళ్ళి. బుర్ర పిచ్చెక్కి పోతోంది. గుండెల్లో మంటలు. ఒళ్లంతా చెమట.

భయం! భయం! భయం!.

కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. అయినా రెప్పలమీద బెడ్ లైట్ వెలుగు...మళ్ళీ సమస్యలు... ఆందోళన... భయం!

దుప్పటి కప్పుకున్నాడు. కాళ్ళుముడుచుకున్నాడు. ముసుగులో ముడుచుకుపడుకున్నాడు. నిద్రలోకి జారుకున్నాడు.

ఎవరో డాబామీద బల్ల ఈడుస్తున్నట్లుంటే భార్యలేచింది. బల్ల ఈడవటంకాదు. భర్తగురక. తనూ పడుకుండిపోయింది.

దుప్పటి అతని సమస్యలకి తాత్కాలిక పరిష్కారాన్నిచ్చిందేమో మరి! ●